మల్లె గుబాళింపు మాయం

- తెగుళ్లతో రైతుల సతమతం
- పతనమైన దిగుబడులు
- అప్పుల పాలవుతున్న మల్లె రైతు

మల్లె సాగుకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. ఫలితంగా మల్లె పూల గుబాళింపు మాయమైంది. పురుగు మందుల ఖర్చు మేర కూడా దిగుబడి లేకపోవడంతో మల్లె రైతులు సతమతమవుతున్నారు. సాధారణంగా ఈనెలలో ఎంతో సంతోషంగా ఉండాల్సిన మల్లె రైతు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. పూలు కోసే మహిళా కూలీలకూ ఉపాధి లేకుండా పోయింది. రైతులైతే అప్పులపాలవుతున్నారు.



మల్లెను చుట్టుముట్టిన తెగుళ్లు

కొడవలూరు: మండలంలోని తలమంచి, గ్రామనత్తంలలో మల్లె సాగు ఉంది. తలమంచిలో 50 ఎకరాల్లో సాగవుతుండగా, గ్రామనత్తంలో 30 ఎకరాల్లో సాగవుతుంది. అదేవిధంగా బుచ్చి మండలం కాగులపాడులో 100 ఎకరాల్లో.. విడవలూరు మండలం ముదివర్తిలో కూడా మల్లె సాగు జరుగుతోంది. వీరంతా కూడా చిన్న రైతులే. ఒక్కో రైతు ఆరు సెంట్ల భూమి నుంచి అర ఎకరాలో మల్లె సాగు చేస్తున్నారు. మల్లె సాగుకు పెట్టుబడి అధికం కావడంతో అంతకంటే ఎక్కువ భూమిలో సాగు చేయరు. అయితే ప్రస్తుతం మల్లె రైతు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తెగుళ్ల బెడదతో సతమతమవుతున్నారు. సాధారణంగా మల్లె రైతు వర్షాకాలమైన నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు పంట విరామం ఇస్తారు. వర్షాకాలంలో పూల దిగుబడి ఉండదు. కానీ మిగిలిన రోజుల్లో పూల దిగుబడి ఆశాజనకంగా ఉండి లాభాలతో ఉండాల్సిన మల్లె రైతు తెగుళ్ల బారిన పడి దిగుబడి లేక పురుగు మందుల ఖర్చు పెరిగి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

వెన్నాడుతున్న తెగుళ్ల బెడద

మల్లె రైతును తెగుళ్ల బెడద వెన్నాడుతోంది. పూల దిగుబడి ఆశాజనకంగా ఉండాల్సిన ప్రస్తుత తరుణంలో అర ఎకరంలో సాగయ్యే తోటలోనూ కిలో పూలు రావడం గగనంగా మారింది. కాగా మల్లె సాగును పచ్చ పురుగు, నల్లి తదితర తెగుళ్లు చుట్టుముట్టాయి. ఫలితంగా దిగుబడి పూర్తిగా పతనమైంది. తెగుళ్ల నివారణకు ఎన్ని రకాల మందులు వాడినప్పటికీ ఫలితం కనిపించడం లేదని మల్లె రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక లీటరు పురుగు మందు రూ.800లు ఉంటుందని, ఇలాంటివి రెండు లేదా మూడు రకాలు కలిపి చల్లాల్సి ఉంటుంది. అయినప్పటికీ తెగుళ్ల నుంచి విముక్తి లభించక దిగుబడి రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

మహిళా కూలీల ఉపాధికి గండి

మల్లె సాగును తెగుళ్లు వెన్నాడుతుండడంతో మహిళా కూలీల ఉపాధికి పూర్తిగా గండి పడింది. మల్లె పూలు కోసేందుకు ఎక్కువగా మహిళా కూలీలే వస్తుంటారు. పూలు బాగు పూస్తుంటే ఒక్కో కూలీ రోజుకు పది నుంచి 15 కిలోల వరకు కోస్తారు. ఒక కిలోకు రూ.60లు ఇస్తున్నందున ఒక్కో మహిళా కూలీ రోజుకు రూ.900ల వరకు కూడా సంపాదిస్తారు. ఇప్పుడు తెగుళ్ల బెడదతో పూలు పూయకపోతుండడంతో వారు ఉపాధి కోల్పోయారు.

ఫలితం శూన్యం

ప్రస్తుతం మల్లె పూల ధర ఆశాజనకంగా ఉంది. లీటరు పూలు రూ.వందకు పైగా పలుకుతున్నాయి. ఒక కిలో పూలు రెండున్నర లీటరుకు సమానం. కూలీలకు కిలోల లెక్కన నగదు చెల్లించినా రైతులు మార్కెట్‌లో లీటర్ల లెక్కలో విక్రయించుకొంటారు. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా పూల దిగుబడి లేకపోవడంతో మల్లె రైతు నష్టపోతుండడంతోపాటు కూలీలు కూడా ఉపాధి కోల్పోయారు.



పూలు లేకుండా..

అరకొర పూలను కోస్తున్న కూలీలు



ఉపాధి కోల్పోయాం



ఏటా ఈ మాసంలో మల్లె పూల సాగు విరివిగా ఉంటుంది. పూలు కోసేందుకు వెళ్లి ఉపాధి పొందుతాం. రోజుకు పది నుంచి 15 కిలోల వరకు కోస్తాం. దీనివల్ల స్వగ్రామంలోనే ఆశాజనకంగా ఉపాధి పొందుతాం. కానీ ఈ ఏడాది మార్చి నుంచి కూడా తెగుళ్ల కారణంగా పూల దిగుబడి పతనమైంది.

– దొరసానమ్మ, మల్లెపూల కూలీ, గ్రామనత్తం, కొడవలూరు మండలం

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



మల్లెపూల సాగు ఉంటే కోతకు వెళ్లి డబ్బులు సంపాదిస్తాం. దీంతో ఇంట్లోని భర్త సంపాదనతోడై ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఇల్లు గడిచిపోయేది. ప్రస్తుతం మల్లె పూల దిగుబడి లేకపోవడంతో ఇంట్లోని మగవారి సంపాదనపైనే ఆధారపడాల్సి వచ్చి ఇబ్బందులెదుర్కొంటున్నాం.

– రమణమ్మ, మల్లెపూల కూలీ, గ్రామనత్తం, కొడవలూరు మండలం

అప్పలు చేయాల్సి వస్తోంది



మల్లె పంటలో నాటు చెట్లయితే 20 ఏళ్ల పాటు సాగు చేస్తాం. హైబ్రిడ్ చెట్లయితే పదేళ్ల పాటు సాగు ఉంటుంది. కాగా 2019 నుంచి మల్లె సాగును తెగుళ్ల బెడద ఉంది. అయినప్పటికీ కాస్తో కోస్తో దిగుబడి ఉంటుండడంతో నష్టాల బారిన పడకుండా నెట్టుకొస్తున్నాం. కానీ ఈ ఏడాది పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. తెగుళ్లకు ఎన్ని మందులు కొట్టినా ఫలితం కనిపించడం లేదు. దీంతో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి మల్లె రైతుకు ఎలాంటి రాయితీలు కల్పించడం లేదు. మా దయనీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రాయితీలివ్వాలని కోరుకొంటున్నాం.

– మస్తాన్‌బాషా, మల్లె రైతు, గ్రామనత్తం, కొడవలూరు మండలం

క్లుప్తంగా

పేరెంట్స్ మీట్‌లో ఎమ్మెల్యేకు చుక్కెదురు



భోజన నిర్వాహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని డీఎల్‌ఎన్నార్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ – టీచర్స్ సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి చుక్కెదురైంది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదని, తల్లికి వందనం నగదు అకౌంట్లలో పడలేదని పలువురు తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల విద్యార్థులు కూడా ఎమ్మెల్యే ఎదుట తమకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం సరిగ్గా అందించడం లేదని ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు కూడా ఇవ్వలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు కూడా పరిశుభ్రంగా లేవని, ఉపాధ్యాయుల తీరు సక్రమంగా లేదని పేరెంట్స్ ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకురాలికి నెలరోజుల సమయం ఇస్తున్నానని, తీరు మారకపోతే విధుల నుంచి తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాఠశాలలో 560 మంది విద్యార్థులుండగా గుడ్లు తక్కువ ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓలు ప్రతిరోజూ పాఠశాలను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం డీఎల్ఎన్నార్ జూనియర్ కళాశాలను సందర్శించారు. అధ్యాపకులకు పలు సూచనలు తెలియజేశారు.

దుకాణాల్లో తనిఖీలు



విడవలూరు: మండల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలను పోలీసులు గురువారం తనిఖీ చేశారు. పొగాకు విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై నరేష్ హెచ్చరించారు.

దాడుల సంస్కృతి తగదు



మాట్లాడుతున్న గౌరి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం దాడుల సంస్కృతికి తెర తీసిందని, ఇది మంచి పద్ధతి కాదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. 200 మంది టీడీపీ అల్లరిమూకలు ప్రసన్న ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారని, ఇంట్లో ఉన్న 85 ఏళ్ల వయసున్న తల్లిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. జిల్లా చరిత్రలోనే ఒక మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. పోలీసులు దాడి చేసిన వారిపై ఇంతవరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా తాత్సారం చేయడం కూటమి ప్రభుత్వ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. దీనిపై చర్యలు తీసుకోకపోతే మహిళా విభాగం తరపున పోరాటం చేస్తామన్నారు. అనంతరం మహిళా నేతలు కామాక్షి దేవి, ధనుజారెడ్డి, ప్రవల్లిక, బెల్లంకొండ వాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నెల్లూరు రాజకీయాలపై భయం వేస్తోందని, ఇంత జరిగినా పోలీసులు స్పందించకపోవడం చూస్తే రాష్ట్రంలో పాలన ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం సెక్రటరీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: కేంద్ర కార్మిక శాఖ బీడీ కార్మికులతో పాటు ఐరన్, మైకా, సున్నపురాయి, తదితర గనుల్లో పనిచేసే కార్మికుల పిల్లల నుంచి ఉపకార వేతనాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆత్మకూరు కార్మిక డిస్పెన్సరీ డాక్టర్ ఎస్ అర్జున్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఆగస్టు 31, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, అగ్రికల్చర్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబరు 31వ తేదీలోగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040 29561297 నంబరు లేదా స్థానిక డిస్పెన్సరీలో సంప్రదించాలని కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



బీసీ వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న అరుణమ్మ

మనుబోలు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామం ఎస్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. పాఠశాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన బీసీ వసతి గృహాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదన్నారు. బాగా చదువుకుంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేయడాన్ని ఉపాధ్యాయులు ఉద్యోగంలా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. అక్కంపేట పాఠశాల అభివృద్ధికి ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గుండా వజ్రమ్మ, అక్కంపేట సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, ఎస్ఎస్ఆర్ ఫౌండర్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ జలజాక్షి, ఎంఈఓ రమేష్‌కుమార్, ఎస్సై రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రసన్నకు పలువురి పరామర్శ



ప్రసన్నను పరామర్శిస్తున్న ఆంజనేయరెడ్డి తదితరులు

కోవూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి గురువారం పరామర్శించారు. నెల్లూరులోని ప్రసన్న నివాసంలో ఘటన వెనుక గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

- నెల్లూరు (పొగతోట) : మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పరామర్శించారు. నగరంలోని ప్రసన్న నివాసానికి గురువారం చేరుకుని జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ప్రసన్న తల్లిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ప్రసన్నను పరామర్శిస్తున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా



దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల వద్ద గురువారం నెల్లూరు నుంచి కావలి వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కంటైనర్ రహదారికి అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో హైవే సిబ్బంది వాహనాలను సర్వీస్ రోడ్డు మీదుగా దారి మళ్లించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. అల్లూరు రోడ్డు ఫ్లై ఓవర్‌పై నుంచి వస్తున్న కంటైనర్ ముందు వెళుతున్న కారును తప్పించబోయి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. క్రేన్ సాయంతో కంటైనర్‌ను పక్కకు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

కాకాణి పూజిత పరామర్శ



నివాళులర్పిస్తున్న పూజిత

పొదలకూరు: మండలంలోని శాంతినగర్, అయ్యగారిపాళెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కుటుంబాలను గురువారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పరామర్శించారు. తోడేరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన పాణ్యం సువార్తమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భౌతిక కాయం వద్ద పూజిత నివాళులర్పించారు. సువార్తమ్మ కుటుంబానికి సానుభూతి తెలిపారు. అయ్యగారిపాళెం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు కట్టా పెంచలయ్య దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, పొదలకూరు ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, లక్కు స్వరాజ్, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.గోపాలయ్య, కట్టా పెంచలభాస్కర్‌రెడ్డి, ఏటూరు వేణురెడ్డి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దిగజారుడు రాజకీయాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో దిగజారుడు రాజకీయాలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చీదెళ్ల కిషన్, ఇతర నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రసన్న ఇంటిపై దాడి, హత్యాయత్నం మంత్రి నారా లోకేశ్ ప్రోద్బలంతోనే జరిగిందన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మా పార్టీలో ఉన్నప్పుడు ఎంతో గౌరవించామన్నారు. పార్టీ మారిన తర్వాత దిగజారి రాజకీయాలు చేస్తున్నారన్నారు. దాడి జరిగిన రోజు రాత్రి ప్రసన్న ఫిర్యాదు ఇస్తే ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. అయితే ఆయన మీదనే కేసు నమోదు చేసి నాలుగు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారన్నారు. చీదెళ్ల కిషన్ మాట్లాడుతూ ఎంతోమంది రాజకీయ ప్రముఖులు జిల్లా నుంచి రాజకీయాలు చేశారని, కానీ ఎవరి దగ్గర ఇటువంటి సంస్కృతి చూడలేదన్నారు. రాజకీయాల్లో ఒకరికి ఆదర్శంగా ఉండాలే తప్ప ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం తగదన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా రాజకీయ నాయకులకు ఉమ్మడి రాష్ట్రంలోనే కాక దేశంలో కూడా హుందా రాజకీయాలు చేస్తారనే బ్రాండ్ ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వంలో పూర్తిగా దిగజారిందన్నారు. అన్ని చర్యలకు సమాధానం చెప్పే రోజు దగ్గరలో ఉందన్నారు.

చెరువు ఆక్రమణల తొలగింపు



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పొదలకూరు: మండలంలోని మరుపూరు పెద్ద చెరువులో ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం తొలగించారు. చెరువు ఆక్రమణలకు గురై సాగు భూమిగా మారుతున్నట్టు గ్రామానికి చెందిన వారు వినతిపత్రాలను సమర్పించారు. దీంతో అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించినట్టు తెలిసింది. గ్రామంలో పెద్ద చెరువు, నాయుడు చెరువు, చిన్నచెరువు ఉన్నాయి. ఆక్రమణల తొలగింపును ఆర్ఐ నారాయణ, ఇరిగేషన్ ఏఈ అనిల్‌కుమార్ చేపట్టారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి విశిష్ట గుర్తింపు



గవర్నర్ నుంచి రెడ్‌క్రాస్ పతకాన్ని స్వీకరిస్తున్న దృశ్యం

ముత్తుకూరు(పొదలకూరు): స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) ద్వారా విశిష్ట గుర్తింపు లభించినట్టు సీఈఓ జనమేజయ మహాపాత్ర గురువారం తెలిపారు. బుధవారం విజయవాడలో ఏపీ గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ చాప్టర్ చైర్మన్ ఎస్.అబ్దుల్ నజీర్ ఎస్ఈఐఎల్ ఎనర్జీ సీఎస్ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్ రెడ్‌క్రాస్ పతకాన్ని అందజేసినట్టు చెప్పారు. తాము సామాజిక సేవలో ముందుంటున్నట్టు తెలిపారు. రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రికి 150 కేడ బ్ల్యూహెచ్ ఆన్‌గ్రిడ్ సోలార్, 4 సోలార్ వాటర్ హీటర్లు, అల్ట్రా సౌండ్ మిషన్, మామోగ్రఫీ మిషన్, హార్మోనిక్ స్కాల్పెల్, ఫ్రొజెన్ సెక్షన్, హెమటాలజీ అనలైజర్ వంటి వైద్య పరికరాలను అందించినట్టు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ



పొదలకూరు: ప్రత్యేకాలంకరణలో బాబా



మనుబోలు మండలంలో..



కోవూరులో అన్నదానం

పొదలకూరు: పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడి కొనసాగింది. అన్నదాన కార్యక్రమం జరిగింది. అయ్యప్పనగర్ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించారు. శ్రీనివాస లేవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి.

- మనుబోలు: మండలంలో గురుపూర్ణిమ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మడమనూరు, వెంకన్నపాళెం, జట్ల కొండూరు, మనుబోలు కోదండరామపురంలోని సాయిబాబా మందిరాల్లో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అలాగే ఇతర ఆలయాల్లో కూడా పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు.
- కోవూరు: కోవూరు ఎన్టీఎస్ గేటు సమీపంలో ఉన్న కృష్ణసాయి మందిరంలో అర్చకుడు వీరేంద్రనాథ్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు లేబూరు సుధాకర్‌రెడ్డి-లక్ష్మీప్రసన్న దంపతులు పూజలో పాల్గొన్నారు. అనంతరం రామిరెడ్డి గజేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు, రామిరెడ్డి మల్లికార్జున, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గురువులకు సన్మానం

పొదలకూరు: గురుపూర్ణిమ సందర్భంగా గురువారం స్థానిక శివాలయంలో ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు చినరాములను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరం కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన జాకీర్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గాయపడిన జాకీర్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ కోవూరు పట్టణ కమిటీ ఎంపిక

కోవూరు: వైఎస్సార్‌సీపీ కోవూరు పట్టణ కమిటీని అధికారికంగా పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నాగేటి అవినాష్, బైన రాజా, ఏలూరి హరిబాబు, కోశాధికారిగా తలపాల్ వేణుగోపాల్‌తో పాటు ముగ్గురు ఉపాధ్యక్షులు, ఆరుగురు కార్యదర్శులు, 15 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని, మాకు బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.

జాతీయ మత్స్య రైతుల దినోత్సవం

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని ఫిషరీస్ కాలేజీలో గురువారం జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆక్వాకు సంబంధించి వివిధ కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించాయి. అనంతరం ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇద్దరు విద్యార్థులను సోమిరెడ్డి ఫౌండేషన్ దత్తత తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు.